క్లుప్తంగా

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం



పందిరి రాట పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి మే ఐదు వరకూ నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పందిరి రాటపూజ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో సేవలందించే భక్తులు గురువారం గోవిందమాల దీక్షాదారణ చేయనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు అర్చకులు, భక్తులతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై కళాజాతా

తుని రూరల్: వంట గ్యాస్ ప్రమాదాల నివారణపై మహిళలను అప్రమత్తం చేస్తూ కళాజాతా నిర్వహించారు. బుధవారం తుని సమత గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో తేటగుంటలో వీర్నాల కృష్ణ కళాకారుల బృందం ఆటపాటలతో మహిళలకు అర్థమయ్యేలా కళాజాతా ప్రదర్శించారు. వంటింట్లో గ్యాస్ లీకేజీ, సిలెండర్ వద్ద మంటలు వ్యాపిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ అత్తి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు దేవి, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సునీత



ప్రిన్సిపాల్‌కు స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు

ఏలేశ్వరం: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డి.సునీత బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి ఆమె ప్రమోషన్‌పై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రయాగమూర్తి బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రిన్సిపాల్‌ను అధ్యాపకులు సాదరంగా స్వాగతం పలికారు.

తెల్లదోమ నివారణపై అవగాహన

గండేపల్లి: మల్లేపల్లిలో హైవేని ఆనుకుని ఉన్న మంగళవాని చెరువుకు ఎదురుగా ఉన్న పామాయిల్ తోటలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించినట్టు ఉద్యాన అధికారి కనకయ్య తెలిపారు. కొబ్బరి, పామాయిల్ తోటలకు ఆశిస్తున్న తెల్లదోమ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెదవేగి ఆయిల్ పామ్ రీసర్చ్ సెంటర్ సైంటిస్ట్ చలపతిరావు, ఉద్యాన శాఖ ఏడీ రమణ తదితరులు అవగాహన కల్పించారు.

శంఖవరం: నెల్లిపూడిలో ఆర్బీకే సిబ్బంది, రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పామాయల్ సాగులో తెగుళ్ల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన అధికారి పి.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కొబ్బరి, పామాయల్‌ను నష్టపరుస్తున్న తెల్లదోమ నివారణకు 3 మిల్లీలీటర్ల వేపనూనె, డిటర్జంట్ 0.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు.

సారాతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: సారా తరలిస్తున్న ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... ఏలేశ్వరం మండలం రమణయ్యపేట వద్ద బైక్‌పై సారా తరలిస్తున్న అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామానికి చెందిన కాకడ శ్రీనును అరెస్టు చేసి, అతని నుంచి పది లీటర్ల సారా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు మండలం కేతనగిరి మిర్తివాడ గిరిజన తండాలో పది లీటర్ల సారాతో పూజల లోవమ్మను అరెస్టు చేశామన్నారు. ఏలేశ్వరం మండలం రమణయ్యపేటలో పరారీలో ఉన్న సారా విక్రేత స్వాముల చిట్టెమ్మపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బీజేపీని గద్దె దించాలి

తుని: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని గద్దె దించేందుకు ప్రజలంతా ఏకం కావాలని సీపీఎం కాకినాడ జిల్లా కమిటీ సభ్యురాలు బేబీరాణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక గర్ల్స్‌హైస్కూల్ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ కార్పొరేట్ల అభివృద్ధే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అంబానీ, అదానీలకు లక్షల కోట్ల రూపాయలు దోచిపెడుతున్నారని, ప్రజలపై ధరల భారం మోపుతున్నారన్నారు. ప్రజలపై పన్ను, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల భారాన్ని తగ్గించాలని డిమాండు చేశారు. సీపీఎం నాయకులు నక్కెళ్ల శ్రీనివాస్, కే లోవరాజు, ఎస్‌కే పద్మ, రాంబాబు, మంగరాజు, మాణిక్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నా

ప్రత్తిపాడు: మన్యం జిల్లాలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి అక్రమంగా సస్పెండ్ చేసిన అధికారుల సస్పెన్షన్‌ను తక్షణం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధ్యాయుల ధర్నా చేపట్టారు. ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలను ధరించి, ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు అందజేశారు. ఏపీటీఎఫ్ నాయకులు కేఎస్ సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్, వెంకటరమణ, శ్యామలకుమారి, యూటీఎఫ్ నాయకుడు ఎ.తాతబ్బాయి పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు వేళాయె..

- గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణ
- మంచి భూమితోనే బంగారు పంటలు
- మూతపడిన ఎస్‌టీఎల్, పూర్తికాని అగ్రిల్యాబ్ పనులు



వి.కొత్తూరులో ఇటీవల మట్టి నమూనాల సేకరణపై వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు శిక్షణ ఇస్తున్న ఏఓ అశోక్‌కుమార్

తుని రూరల్: తెగుళ్లు, శత్రు పురుగుల బెడద అదుపు చేసేందుకు నేలతల్లి ఆరోగ్యం ఎంతోముఖ్యం. నేలతల్లి ఆరోగ్యంగా ఉంటేనే బంగారు పంటలు పండుతాయి. ఖరీఫ్ పంటలకు ముందు ప్రతి సంవత్సరం మట్టి నమూనాలు సేకరించి, పరీక్షించడం తప్పనిసరి. దాంతో ఈ ఏడాది భూసార పరీక్షలు చేయనున్నారు. ఇందుకు సమయం ఆసన్నమైంది. వందల సంఖ్యలో మట్టి నమూనాలు సేకరించి పరీక్షించాల్సి ఉంది. పరీక్షా ఫలితాలకు అనుగుణంగా సూక్ష్మ పోషకాలతో భూసారాన్ని పెంచుకోవలసి ఉంది. ఆ తర్వాత ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతారు. ఉన్నత అధికారులు లక్ష్యాలను నిర్దేశిస్తే మే నెలలో మట్టి నమూనాలను సేకరించేందుకు వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్ విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. తుని సబ్ డివిజన్ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు ఆధ్వర్యంలో ఇప్పటికే వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు మట్టి నమూనాల సేకరణపై శిక్షణ పూర్తయ్యింది.

భూసార లోపాలు గుర్తింపు

భూ సారం గుర్తింపు, సవరణ లక్ష్యంగా మట్టి నమూనాలు సేకరించి పరీక్షించనున్నారు. సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో 1.20 లక్షల ఎకరాల్లో వ్యవసాయం, ఉద్యానం, సెరీకల్చర్ సాగయ్యే భూములు ఉన్నాయి. ఒక్కొక్క మండలంలో ఐదు నుంచి ఆరు వందల మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది. అధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం ఒక్కొక్క రైతు భరోసా కేంద్రం పరిధిలో రెండేసి చొప్పున మట్టి నమూనాలు సేకరించినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. వ్యవసాయ పంటలు పండే 2.2 హెక్టార్ల విస్తీర్ణంలో ఒక మట్టి నమూనా , ఉద్యాన తోటల సాగయ్యే పది హెక్టార్ల విస్తీర్ణంలో ఒకటి చొప్పున మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది. ఇలా సేకరించిన మట్టి నమూనాలను పరీక్షించి ఫాస్పరస్, పొటాషియం, జింక్ తదితర సూక్ష్మ దాతువు లోపాలను గుర్తిస్తారు. ఆయా లోపాలను సవరించేందుకు అవసరమైన



ఎస్.అన్నవరం పరిధిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వీఏఏ నాయుడు, రైతు

నివేదికలను (సాయిల్ శాంపిల్ టెస్ట్ రిపోర్ట్స్) రైతులకు అందిస్తారు. సాయిల్ టెస్ట్ రిపోర్ట్స్, అధికారుల సూచనలు ఆధారంగా నేలస్వభావాన్ని బట్టి భూసారాన్ని పెంచేందుకు రైతులు సూక్ష్మ పోషకాలను నేలలో కలియదున్నుతారు.

> **ఖరీఫ్‌కు ముందే ఫలితాలు**
>
> సబ్ డివిజన్‌లో 99 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటికే ఆర్బీకేకు రెండేసి చొప్పున మట్టి నమూనాలు సేకరించి పరీక్షించేందుకు సామర్లకోట ఎస్‌టీఎల్‌కు పంపించాం. అధికారుల ఆదేశాలతో మరిన్ని మట్టి నమూనాలు సేకరిస్తాం. ఖరీఫ్‌కు ముందే రైతులకు సాయిల్ టెస్ట్ రిపోర్టులను అందజేస్తాం. గ్రామస్థాయిలో వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్ అసిస్టెంట్ల సహకారంతో రైతులు భూసారాన్ని పెంపొందించుకుని, ఖరీఫ్ పనులు చేపడతారు. దీంతో ఖరీఫ్ పంటల్లో తెగుళ్లు, పురుగుల ఉధృతి తగ్గి దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.
>
> – సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

ఎస్‌టీఎల్ మూత, పూర్తికాని అగ్రిల్యాబ్

సబ్‌డివిజన్‌లో సేకరించిన మట్టి నమూనాలను పరీక్షించేందుకు తుని మార్కెట్ యార్డులో పూర్వం ఏర్పాటు చేసిన సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ కొన్నేళ్లుగా మూతపడింది. రూ.కోటి విలువైన సామగ్రి మూలకు చేరింది. తునిలో రూ.40 లక్షలతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో సేకరించిన మట్టి నమూనాలను సామర్లకోట ఎస్‌టీఎల్‌కు తరలించి పరీక్షించాలి.

ఏలేరులో తగ్గిన నీటినిల్వలు

ఏలేశ్వరం: ఎండలకు ఏలేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ప్రాజెక్టులో బుధవారం నాటికి రూ.86.56 మీటర్లకు 76.86 మీటర్లు, 24.11 టీఎంసీలకు 10.06 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దీంతో దిగువ ఆయకట్టుకు 200, విశాఖకు 225 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. పంపాకు, తిమ్మరాజు చెరువుకు నీటి విడుదల నిలిపివేశారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

అన్నవరం: స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న 4.25 ఎకరాల సత్యదేవుని దేవస్థానం భూమిలో గురువారం సాయంత్రం మారేడు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ భూమి కౌలు రైతు నుంచి గత నెలలో దేవస్థానం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మారేడు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశారు.

లబ్ధిదారులను ప్రోత్సహించండి

కోటనందూరు: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులను అధికారులు ప్రోత్సహించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణంపై రెవెన్యూ, విద్యుత్, మహిళా సమాఖ్య, ఉపాధిహామీ, ఇంజినీరింగ్ శాఖల సమన్వయ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ మంజూరైన ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేసేలా అధికారులంతా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో కల్పించాల్సిన వసతులపై సమన్వయంగా పని చేయాలన్నారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు ఇళ్ల నిర్మాణం విధివిధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

జగన్‌పై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం



విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతం
- రాష్ట్రంలో టాప్ టెన్ నియోజకవర్గాల్లో ప్రత్తిపాడు

అన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం టాప్ టెన్‌లో ఉందన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక వన్ హోటల్ రిసార్ట్స్‌లో శంఖవరం, రౌతులపూడి మండలాల పార్టీ కన్వీనర్లు, నాయకులు, వలంటీర్లు తదితరులతో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతమైందని, నియోజకవర్గంలో 90,821 గృహాలను సందర్శించాల్సి ఉండగా 80,951 గృహాలకు వెళ్లి ప్రభుత్వ పాలనపై అభిప్రాయ సేకరణ చేసి, పార్టీ కార్యాలయ నంబర్‌కు మిస్డ్ కాల్ చేశామన్నారు. ఈ విజయం వెనుక పార్టీ కార్యకర్తలు, నాయకులు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, వలంటీర్లు, ఇంకా ఎంతోమంది కృషి దాగి ఉందని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కుడుపూడి భరత్, లలిత కళల కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్య సృజన, శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు తదితరులు ఎమ్మెల్యే పర్వతను అభినందించారు. వైస్ ఎంపీపీ ధారా వేంకట రమణ, పత్తిపాడు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, డైరెక్టర్ పలివెల శ్యామల, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



చలివేంద్రాన్ని ప్రారంభించి, మంచినీళ్లను పంపిణీ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, పక్కన విదేశీయులు

- మంత్రి దాడిశెట్టి రాజా
- చలివేంద్రం ప్రారంభం

తుని రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు మనమంత ఐక్యంగా కృషి చేద్దామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. బుధవారం తుని మండలం హంసవరంలో గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ అణగారిని వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడైన అంబేడ్కర్ పేదల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. అటువంటి మహనీయుని ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. సర్పంచ్ మేరీఅవినాష్ ఆడపడుచు నిర్మల గతేడాది పరీక్ష రాసేందుకు హంసవరం నుంచి విశాఖపట్నం వెళ్తూ రైలు ప్రమాదానికి గురై రెండు కాళ్లు కోల్పోయింది. ఇటలీలో ఆరు నెలలు చికిత్స పొంది, కృత్రిమ కాళ్లను ఏర్పాటు చేసుకుని తిరిగి క్షేమంగా వచ్చిన ఆమెను మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించారు. చికిత్స చేసిన విదేశీ వైద్యులు, మంత్రి రాజాతో కలసి ఆమె కేక్ కటింగ్ చేసి సంతోషం పంచుకున్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ నాగం దొరబాబు, మాజీ సర్పంచ్ అత్తి వెంకటరమణ పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం.. ప్రజల్లో ఆనందం

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, దీంతో ప్రజలు ఆనందంగా ఉన్నారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. ఇర్రిపాక గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామస్తులకు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.



ఇర్రిపాక గ్రామంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోటనందూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో టీజే నగరం వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం భీమవరం గ్రామానికి చెందిన శరగణం కన్నయ్యనాయుడు(52) బొద్దవరం గ్రామంలో జరుగుతున్న గొంపమ్మతల్లి పండగకు అత్తవారింటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో టీవీఎస్ బైక్‌పై బొద్దవరం నుంచి టీజే నగరం పేరంటాలమ్మతల్లి గుడి దగ్గరకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న బైక్ పై మద్యం సేవించి వస్తున్న ఇద్దరు యువకులు ఢీకొన్నారు. దీంతో కన్నయ్యనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై స్వామినాయుడు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రత్తిపాడు: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ మాట్లాడుతూ స్థానిక బార్ సభ్యుడు యార్లగడ్డ శ్రీనివాసరావుపై రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రతివాదికి చెందిన వ్యక్తులు దాడి చేయడాన్ని, ఇటీవల బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యుడిపై జరిగిన దాడులను ఆయన ఖండించారు. శ్రీనివాసరావుపై దాడి చేసిన దుండగులను తక్షణం అరెస్టు చేసి, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని బుగత శివ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి రాజాల చిట్టిబాబు, ప్రతినిధులు రవణం వీర వెంకట్రావు, ఆకాశపు కేశవ నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న బార్ ప్రతినిధులు

పాఠశాలల సోషల్ ఆడిట్ పకడ్బందీగా చేపట్టాలి

ప్రత్తిపాడు: రాబోయే విద్యా సంవత్సరంలో నూతనంగా చేపట్టబోయే పాఠశాల సోషల్ ఆడిట్ పకడ్బందీగా చేపట్టాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల కో ఆర్డినేటర్ కె.హరికృష్ణ అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ మానవ వనరుల కేంద్రంలో సోషల్ ఆడిట్‌పై బుధవారం మండల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను ఆయన పర్యవేక్షించారు. ఈశిక్షణలో పాఠశాల నిర్వాహణ, వ్యయం (పాఠశాల ఖర్చులు), రోజువారీ పర్యవేక్షణ, సోషల్ ఆడిట్ నిర్వాహణ తదితర అంశాలపై రీసోర్సు పర్సన్, అన్నవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎ.వెంకట సుబ్బిరెడ్డి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వి రాజబాబు, సీఆర్పీలు కొల్లు గంగాధర్, నీలి అప్పన మల్లేషు, ఇ రాంజీ ప్రసాద్, ఎస్‌కె బాషా తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న హరికృష్ణ

గండేపల్లి: పరిషత్ కార్యాలయంలో బుధవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించినట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. మండలంలోని 41 ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

29న హలో బీసీ చలో అనకాపల్లి

ప్రత్తిపాడు: బీసీ హక్కుల సాధన కోసం ఈనెల 29వ తేదీన తలపెట్టిన హలో బీసీ చలో అనకాపల్లిని విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యువజన అధ్యక్షుడు రాయుడు కాక, మహిళా కన్వీనర్ అనుసూరి పద్మావతి, గౌరవ అధ్యక్షురాలు బర్ల సీతారత్నం, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సుజన (964)



దుర్గాభవాని (950)



మీనాక్షి (927)



కట్టా అంజనీసూర్యప్రభ ఏలేశ్వరం (960)

కోటనందూరు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అల్లిపూడి కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఇంటర్ ఎంపీహెచ్ఏలో 1000 మార్కులకు ఎ.సుజన 964, ఎల్.దుర్గాభవానీ 950, జి.మీనాక్షి 927 మార్కులు సాధించి సత్తాచాటారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 37 మంది విద్యార్థినులు హాజరు కాగా 16 మంది, మొదటి సంవత్సరంలో 38 మంది పరీక్ష రాయగా 16 మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఎస్ఓ ఆర్.రాజేశ్వరి తెలిపారు.

తుని: ఇంటర్ ఫలితాల్లో బాలికలు ప్రతిభ చూపారని తుని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. బుధవారం సాయంత్రం విద్యాశాఖ విడుదల చేసిన ఫలితాల్లో పలువురు విద్యార్థినులు అత్యున్నత మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సరానికి సంబంధించి 305 మంది పరీక్షకు హాజరు కాగా 60 మంది, ద్వితీయ సంవత్సరంలో 321 మందికి 72 మంది ఉత్తీర్ణిత సాధించారని తెలిపారు. ఎంపీసీలో జె.లక్ష్మి(933), బైపీసీలో మోహనలక్ష్మీకుమారి(931), ఒకేషనల్‌లో ఎన్.భవాని(974) మార్కులు వచ్చాయన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, అధ్యాపకులు అభినందించారు.

రౌతులపూడి: ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో టి.నవీన్‌కుమార్ 909, ఎం.మాధవ్902 మార్కులు సాధించారు.

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 148 మందికి 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 28 శాతం, ద్వితీయ సంవత్సరం 179 మందికి 74 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 41 శాతం సాధించారు. ఒకేషనల్ కోర్సులో ప్రథమ సంవత్సరం 28 మందికి 9 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 32 శాతం, ద్వితీయ సంవత్సరం 23 మందికి 17 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 94 శాతం సాధించారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరం 62 మందికి 49 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 79 శాతం సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కట్టా అంజనీసూర్యప్రభ ద్వితీయ ఎంపీసీలో అత్యధికంగా 960, కోరాడ శిరీష ద్వితీయ బైపీసీలో 961, ద్వితీయ సీఈసీలో జి. మణికంఠ 870 మార్కులు సాధించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం మండల మహిళ సమాఖ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధి కృషి చేస్తున్నారన్నారు. మండలంలో ఆసరా పథకంలో భాగంగా ఈ ఏడాది 893 గ్రూపులకు రూ.76944738.75 మహిళల ఖాతాల్లో వేశారని, అందరూ సీఎం జగన్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌సీ రామకృష్ణ, ఏపీఎం సత్యప్రసాద్, సీసీలు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమావేశం

కిర్లంపూడి: మే డే కార్యక్రమాన్ని మండల స్థాయిలో ఘనంగా నిర్వహించాలని ఏపీ గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు సరేళ్ల రాజబాబు అన్నారు. బుధవారం స్థానిక యల్లపు వారి రామాలయంలో పెద్దాపురం డివిజన్ ప్రెసిడెంట్ కట్టు సూరిబాబు అధ్యక్షతనలో పలు మండలాల కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడు జి.శివ, శినివాసరావు పలు గ్రామ పంచాయితీల కార్మికులు పాల్గొన్నారు.

ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్తు'

తొండంగి: గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా సాగింది. తొండంగిలో వైస్ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్, సర్పంచ్ సోమాల ప్రసాద్, ఉపసర్పంచ్ కందా బాబ్జి పలువురు పార్టీ నాయకులు కలిసి ఇంటింటా పర్యటించి ప్రభుత్వం పాలనపై అభిప్రాయ సేకరణ చేశారు. గోపాలపట్నంలో సర్పంచ్ కటకం శివ, ఎంపీటీసీ గునిమానికల ఏసుబాబు పార్టీనాయకులు యడ్ల వెంకటరమణ, అచ్చామరిడయ్య తదితరులు కలిసి గ్రామంలో ఇంటింటా పర్యటించారు. ఎ.వి.నగరంలో తుని వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, సీతారాంపురంలో ఎంపీటీసీ పెండ్యాల రామకృష్ణ, సర్పంచ్ పెండ్యాల సీతారామలక్ష్మి, ఎ.కొత్తపల్లి మండల సమన్వయకమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, సాపిశెట్టి చిన్నా, సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి ఇంటింటా పర్యటించి సర్వే నిర్వహించారు. కోదాడలో బూర్తినాని ఆధ్వర్యంలో పార్టీనాయకులు ఇంటింటా పర్యటించారు. మెట్ట, తీరప్రాంత గ్రామాల్లో కూడా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. కార్యక్రమాల్లో కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కోటనందూరు: మండల వ్యాప్తంగా గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం బుధవారం జోరుగా సాగింది. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలు అందే తీరు తదితర వివరాలు అడిగి నమోదు చేశారు. ప్రజల ఆమోదంలో ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరో మారు వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కాకరాపల్లిలో వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



తొండంగిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, నాయకులు

యువకుడి మృతి

ద్వారకాతిరుమల: మండలంలోని మారంపల్లి పంచాయితీ లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలు ప్రకారం. తూర్పుగోదావరి జిల్లా, శంఖవరం మండలం, మండపం గ్రామానికి చెందిన ఆకేటి గోవిందు(19), అతని తల్లి రత్నం లు ఉదయం స్కూటీపై విజయవాడకు వెళుతున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి కుక్కలు అడ్డుగా రావడంతో వారు స్కూటీపై నుంచి కింద పడిపోయారు. ఆ సమయంలో పైకి లేస్తున్న గోవిందును నల్లజర్ల నుంచి భీమడోలు వైపుకు వెళుతున్న ఒక లారీ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టి, 20 మీటర్ల మేర ఈడ్చుకెళ్లింది. దాంతో తీవ్ర గాయాలు పాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి తల్లి రత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.